ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 8 డిసెంబరు 2025 | 5





రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారి

అసాంఘిక శక్తులను అణచివేస్తాం

- ఎస్పీ రాహుల్ మీనా
- రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్‌ల్లో ప్రత్యేక కౌన్సెలింగ్

అమలాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి అసాంఘిక శక్తులు, రౌడీయిజానికి తావు లేకుండా చూస్తామని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా హామీఇచ్చారు. నేరాలకు పాల్పడే వారిపై, పాతనేరాలను పునరావృతం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కౌన్సెలింగ్ ద్వారా తమ ప్రవర్తన మార్చుకుంటారని ఆశిస్తున్నట్టు తెలిపారు. రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు, పాత నేరచరిత్రను విడిచిపెట్టి మంచి జీవనం గడిపేలా వారికి మార్గనిర్దేశం చేశారని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎటువంటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసుల్లో మానసికోల్లాసం కోసం ఫిట్ ఇండియా: ఎస్పీ

జిల్లాలోని పోలీసు సిబ్బందిలో శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే లక్ష్యంతో అమలాపురం డీఏఆర్ ప్రాంగణంలో ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫిట్ ఇండియా స్ఫూర్తితో విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టిసారించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉల్లాసంగా.. ఉత్సాహంగా యోగా, జుంబా డ్యాన్సు వంటి యాక్టివిటీల్లో పోలీసులు చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ 'ఫిట్‌నెస్ మా జీవన విధానం' అనే నినాదంతో విధి నిర్వహణలో ఎంత బిజీగా ఉన్నా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రథమ బాధ్యత అనే ముఖ్య సందేశాన్ని తెలియచేశారు. కార్యక్రమాల్లో ఆర్ఐ బ్రహ్మానందం, కోటేశ్వరరావు విజయవంతంగా నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

- రూఅర్బన్ పంచాయతీల్లో పీడీవో పోస్టులకు గిరాకీ
- కీలకమైన చోట్ల బదిలీకి ఇప్పటికే రాజకీయ పైరవీలు

అమలాపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు కొత్తకళ సంతరించుకుంది. పదోన్నతులతోకూడిన బదిలీలతో పండుగ వాతావరణం నెలకొంది. కీలకమైన స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయపైరవీలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో పురపాలన తరహాలో పంచాయతీల్లో సేవలందించేందుకు రూర్బన్ పంచాయతీల వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం రూఅర్బన్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులకు రాజకీయ పైరవీలు మొదలయ్యాయి.

గ్రేడ్ కార్యదర్శులు.. పీడీవోలు..

గ్రామ పంచాయతీ, సచివాలయ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణలో ఇప్పటికే సీనియర్లు అయిన 22మంది పంచాయతీ కార్యదర్శులను జిల్లాలో సెక్యూరిటీ ఎంపీడీవోలుగా కూటమి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్-2 కార్యదర్శులను గ్రేడ్-1 కార్యదర్శులుగా నియమిస్తూ జోన్‌లో-2లోభాగంగా జిల్లాలో 31మందికి పదోన్నతులు కల్పించారు. ప్రస్తుతం జిల్లాలో 31 గ్రేడ్-1 పంచాయతీల్లో 31మందిని నియమించేందుకు అధికారిక ప్రక్రియజరుగుతోంది. రోజుల వ్యవధిలోనే వీరంతా గ్రేడ్-1 కార్యదర్శులుగాబాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాలో 18రూఅర్బన్ పంచాయతీలను గుర్తించారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నం, అమలాపురం మండలం కామనగరువు, బండారులంక, పేరూరు, అంబాజీపేట మండలం మాచవరం, ఆత్రేయపురం మండలం ర్యాలి, ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, కాట్రేనికోన, కొత్తపేట మండలం వానపల్లి, కొత్తపేట, మండపేట మండలం ఏడిద, కేశవరం, ద్వారపూడి, రావులపాలెం మండలం రావులపాలెం, రాయవరం మండలం చెల్లూరు, రాజోలు మండలం తాటిపాక, రాజోలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవోల హోదాలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులను 18మందిని పీడీవోలుగా నియమిస్తున్నారు. సీనియారిటీ జాబితాలో బయటపడడంతో రూఅర్బన్ పంచాయతీల మీద కీలక స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయపైరవీలు సాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, పెద్దలను ప్రసన్నం చేసుకోవడంతోపాటు కీలకమైన ఎమ్మెల్యేలను కలుస్తున్నారు. జిల్లాలోని ఒక పంచాయతీలో సుదీర్ఘకాలం పనిచేసిన కార్యదర్శి రూ.1.72కోట్లు స్వాహాతో ఆయనతోపాటు వివిధ ప్రాంతాల్లో విజిలెన్స్ కేసులున్న పలువురు పదోన్నతికి దూరమయ్యారు. కానీ, ప్రస్తుతం రాజకీయ పైరవీలు చేస్తున్నారు. రూఅర్బన్ పంచాయతీల్లో పీడీవోలను ఆ స్థానంలో చేరనిస్తారా లేదా అనే చర్చ జరుగుతోంది.

అసౌకర్యాల చెరలోనే..

- అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తగా ఏర్పడి నాలుగేళ్లు గడిచినా ఇంకా అయోమయమే
- జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు భూసేకరణ ఏది?
- ఎయిమ్స్ కళాశాలకు రూ.1.60 కోట్లు అద్దె బకాయి



అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.. అమలాపురం కేంద్రంగా ఈ జిల్లా ఆవిర్భవించి నాలుగేళ్లు కావస్తున్నా పాలన ఇంకా పూర్తిస్థాయిలో గాడిన పడలేదు. కొన్ని ప్రభుత్వ శాఖల విభజన జరగలేదు. అరకొర సౌకర్యాలతో కొన్ని కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కార్యాలయాల్లో సిబ్బంది, వసతుల లేమి ఇంకా అధికారులను వేధిస్తూనే ఉంది. కొన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

నిరంతరం కాన్ఫరెన్సులు, సమీక్షలకే జిల్లా యంత్రాంగం పరిమితమై ఇచ్చే ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంవల్ల అభివృద్ధి ఆనవాళ్లు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కీలక ప్రాజెక్టులను పూర్తయ్యే ప్రణాళికలను పకడ్బందీగా అమలు కావడం లేదనే విమర్శలు జిల్లా ప్రజలనుంచి వ్యక్తమవుతున్నాయి.

కొన్ని కార్యాలయాలు బోర్డులకే పరిమితం

అమలాపురం కేంద్రంగా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటై చిన్నచిన్న సమస్యలు మినహా సర్వహంగులతోను సిద్ధమై పాలన సాగిస్తున్నారు. ముమ్మిడివరంలో జిల్లాలోని ఇతర కార్యాలయాలను ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినా అక్కడ శాఖల విభజన పూర్తికాకపోవడంతో కొన్ని కార్యాలయాలు బోర్డులకే పరిమితమయ్యాయి. పూర్తిస్థాయిలో కార్యాలయాలు కొన్ని ఇంకా ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఎయిమ్స్‌కళాశాలకు ప్రభుత్వం రూ.కోటి60లక్షల వరకు అద్దె బకాయిలు చెల్లించాల్సిఉంది. ఇక మిగిలిన కార్యాలయాల్లో ఫర్నీచర్, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పట్టించుకోనప్పటికీ శాఖలవారీగా కింది స్థాయి సిబ్బందినుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు కొంతమేర వసతులు సమకూర్చుకుని పాలన సాగిస్తున్నారు. ప్రారంభ దశలో ఉన్న సమస్యలను ఒక్కోటీ అధిగమిస్తూ ముందుకు సాగుతున్నారు.



వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటైన ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల అద్దె భవనం

మండపేట తరలింపు.. తగ్గిన మండలాలు

అప్పుడే జిల్లా విభజన పేరుతో మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేస్తూ ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో 22 మండలాలతో ఏర్పాటైన కోనసీమ జిల్లా ఇప్పుడు 20 మండలాలకే పరిమితమై మరింత కుచించుకుపోయే పరిస్థితులు జిల్లా ప్రజలను కలవరపాటుకు గురిచేస్తోంది. పార్లమెంటు పరిధిని జిల్లాగా ప్రకటిస్తామని గతంలో అప్పటి ప్రభుత్వం ప్రకటించినా వైసీపీ, టీడీపీ కూటమి ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా జిల్లాను విభజించడంవల్ల జిల్లా పరిధి తగ్గిపోయి అభివృద్ధికి అవరోధంగా మారుతోందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయినా సమర్థమైన సేవలు..

అమలాపురంలో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ద్వారా అధికారులు జిల్లా ప్రజలకు సమర్థమైన సేవలను అందిస్తున్నారు.కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా నాయత్వంలో ఇరుశాఖల సిబ్బంది సౌకర్యాలలేమి నుంచి గాడినపడి పాలనాపరంగా ముందుకు వెళ్తున్నారు. నల్లవంతెనవద్ద మాంటిస్సోరి భవనంలో ఎస్పీ కార్యాలయం అద్దెభవనంలో ఏర్పాటైంది. సినిమారోడ్డులో ఆర్మ్‌డ్ రిజర్వుడు స్టాఫ్ వసతిగృహాన్ని నెలకొల్పి వాహనాలన్నింటినీ అక్కడే ఏర్పాటు చేసుకుని సేవలందిస్తున్నారు. గతంలో ఎన్టీఆర్‌మార్గ్ రోడ్డులో ఉండే డీఎస్పీ కార్యాలయాన్ని పాత టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద సెంటర్‌లో ఉండే భవనంలోకి మార్చారు. గతంలో డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ నివాసగృహంగా ఆధునికీకరించారు. ఈదరపల్లిలో కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. జాయింట్ కలెక్టర్ నివాసగృహాన్ని కామనగరువులోని ఇరిగేషన్ బంగ్లాలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇలా జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని ముమ్మిడివరంలోని ఎయిమ్స్ కళాశాల ప్రాంగణంలోను, మరికొన్ని అమలాపురం పరిసర ప్రాంతాల్లోను ఏర్పాటు చేసుకుని పాలనా అందిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోగానీ, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంగానీ కొత్తగా ఆవిర్భవించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ కార్యాలయ భవన సముదాయ నిర్మాణాలకు స్థల సేకరణకు ఇంకా అడుగులు వేయలేదు.

జాతీయ ఉపకార వేతన పరీక్ష ప్రశాంతం

అమలాపురంటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతనం కోసం 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. డీఈవో షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లాలో 3,106మంది విద్యార్థులకుగాను 3038మంది విద్యార్థులు హాజరుకాగా 68మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో డివిజన్ కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. అమలాపురం డివిజన్ పరిధిలో అమలాపురం కేంద్రంగా ఏర్పాటు చేసిన ఆరు పరీక్షా కేంద్రాల్లో 1,376మంది విద్యార్థులకుగాను 1,340మంది విద్యార్థులు హాజరయ్యారు. 36మంది గైర్హాజరయ్యారు. కొత్తపేటలో నాలుగుకేంద్రాలకుగాను 924మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 909మంది పరీక్షకు హాజరుకాగా 15మంది గైర్హాజరయ్యారు. రామచంద్రపురం డివిజన్‌లో 806మంది విద్యార్థులకుగాను నాలుగు పరీక్షా కేంద్రాల్లో 789మంది విద్యార్థులు హాజరుకాగా 17మంది గైర్హాజరయ్యారు. అమలాపురంలోని ఆరు పరీక్షా కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ బీర హనుమంతరావు తనిఖీ చేశారు. మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కాశి ఘనసత్యనారాయణఆధ్వర్యంలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు.

ఏపీఎన్జీవో సంఘం ఎన్నికలకు 11న నామినేషన్లు

అమలాపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించేందుకు తొలిసారిగా రాష్ట్రనాయకత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఎన్నికల అధికారి, ఎన్జీఆర్ జిల్లా అధ్యక్షుడు బి.సత్యనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా పి.రమేష్, డి.జానకి వ్యవహరించనున్నారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశామని తెలిపారు. జిల్లాశాఖ అధ్యక్ష, అసోసియేట్ అధ్యక్ష, ఇతర పదవుల నిమిత్తం మొత్తం 17మందిని ఎన్నుకునేందుకు షెడ్యూల్‌ను ప్రకటించామన్నారు. ఈనెల 11న పోటీలో పాల్గొనేవారు నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. అమలాపురం కాటన్ అతిథిగృహంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అదేరోజున పోటీలో పాల్గొనే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ చొప్పున వేసినప్పుడు ఎన్నిక ఉండదన్నారు. పోటీదారులుంటే ఈనెల 18న ఎన్నిక నిర్వహిస్తామని, అదేరోజున ఓటింగ్ జరిపి విజేతలను ప్రకటిస్తామని సత్యనారాయణరెడ్డి తెలిపారు.

సెలవు రోజుల్లోను టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

అమలాపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో సైతం పదోతరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనపథకం అమలుకు పాఠశాల విద్య ఎండీఎం విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. 2026, మార్చిలో జరిగే టెన్త్ పరీక్షలకు హాజరుకానున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెలవురోజుల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 240 ప్రభుత్వ పాఠశాలల్లోని 12,716మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వర్తించనుంది. ఈనెల 10వతేదీ రెండో శనివారం, ఆదివారం సహా సాధారణ సెలవు రోజుల్లోను అమలు చేయనున్నట్టు తెలిపారు.

విలపింఛన్!

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో..

- నోటిఫికేషన్‌కు ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు
- 17 నెలలైనా స్పందన రాక లబోదిబో
- వెల్లువలా దరఖాస్తులు, వినతులు



ఈమె గత బుధవారం ఒడిలో ఉన్న కుమార్తె పింఛను నిమిత్తం అడిగేందుకు నల్లజర్లలో జరిగిన సీఎం చంద్రబాబు సభకు వచ్చారు..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ రాయుడుపాకలకు చెందిన మాచవరపు రిత్వికా గ్రేస్‌కు ఆరేళ్లు. దివ్యాంగురాలు.. రెండు కాళ్లు పనిచేయవు.. తరచూ పిట్స్ వస్తుంటాయి.. బ్రెయిన్ డ్యామేజీ ఉంది.. దీంతో సదరం సర్టిఫికెట్‌లో 100 శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి చిరు ప్రైవేట్ ఉద్యోగి.. గత నాలుగేళ్లగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.. నేటికీ నమోదు కాలేదు. కూటమి ప్రభుత్వంలో తప్పనిసరిగా పింఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు.. ఈ ప్రభుత్వంలోనూ ఇదే పరిస్థితి. తమ కుమార్తెకు దివ్యాంగ పింఛన్ ఎప్పుడు మంజూరవుతుందో.. ఎప్పుడు తమ కష్టాలు తీరతాయోనని ఎదురుచూపులు చూస్తున్నారు...

కాకినాడకు చెందిన యాళ్ల లలితకు ప్రస్తుతం ఏడేళ్లు. మానసిక, శారీరక వికలాంగురాలు.. సదరం సర్టిఫికెట్‌లో వంద శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి తాపీ పని చేస్తుంటా డు.. గత ఐదేళ్లగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేం దుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా డు.. నేటికీ నమోదు కాలేదు.కూటమి ప్రభుత్వంలోనైనా పిం ఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు..ఇప్పుడూ ఇదే పరిస్థితి.

కాకినాడలోని దుమ్ములపేటకు చెందిన కృష్ణవర్ధన్‌కు నాలుగేళ్లు. డ్రోన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం ఇచ్చారు..తండ్రి ఆటోడ్రైవర్. అంతంతమాత్రమే ఆదాయం. గత మూడేళ్లగా పింఛన్‌కు దరఖాస్తు చేస్తూనే ఉన్నాడు.దరఖాస్తులకు వం దల్లో ఖర్చవుతుంది కానీ నేటికీ ఫలితం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, పరిస్థితిలో మార్పు లేదు. దీంతో లబోదిబోమంటున్నారు.

సామర్లకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి 17నెలలైంది.. నేటికీ కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించడంలేదు. దీంతో వేలాది మంది లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచింది. కొందరికి ప్రత్యేకంగా రూ.15వేలు పింఛను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుకు డిమాండ్ వచ్చింది. దీంతో దరఖాస్తుదారులు పెరిగారు. కూటమి ప్రభుత్వంలో వెంటనే దరఖాస్తులు స్వీకరిస్తుందని లబ్ధిదారులు అనుకున్నారు. కానీ అలా జరగలేదు. దీంతో ప్రభుత్వం నుంచి స్పందనకు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 60వేలమంది వరకూ కొత్త పింఛన్లకు అర్హులు ఉన్నట్టు సమాచారం.

ప్రస్తుత పింఛన్లు ఇవే..

జిల్లా	లబ్ధిదారులు	సొమ్ములు
కాకినాడ	2,71,360	117.81 కోట్లు
కోనసీమ	2,36,284	101.86 కోట్లు
తూర్పు	2,35,060	103.27 కోట్లు

నాడు అలా.. నేడు ఇలా..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరంగా జరిగేది. వారం వారం దరఖాస్తులను పరిశీలించి నెలాఖరుకు జాబితా సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధా నానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకోసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెరమీదకు తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. గడచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వంలో పాతపద్ధతిలో ప్రతినెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని భావించినా ఊసేలేదు.

పెండింగ్‌లో 30 వేల దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి సచి వాలయాల్లో నవంబరు 20 నాటికి సుమారు 30 వేల నూతనంగా పింఛన్లకు దరఖాస్తులు ఉన్నట్టు సమాచారం. వీటిలో కనీసం 24 వేల మందికైనా పింఛను అర్హత ఉంటుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 7,42,704 పింఛనుదారులకు ప్రతి నెలా రూ.322.94 కోట్ల మేర సొమ్ములను ప్రతి నెలా చెల్లిస్తున్నారు.ప్రభుత్వం ఇప్పటి వరకూ ఉన్న దరఖాస్తులకు మంజూరు లభిస్తే ప్రభుత్వానికి అదనంగా మరో రూ.12 కోట్ల మేర భారం కానున్నట్టు అంచనా.



సన్‌డే.. ఫన్‌డే..

అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం వద్దకు ఆదివారం అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తాం..

పాపికొండలకు 13 బోట్లలో 900 మంది పర్యాటకులు



పోశమ్మ గండి వద్ద బోటు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు



పర్యాటకులతో పాపికొండలకు వెళ్తున్న బోటు

దేవీపట్నం/వీఆర్‌పురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలను ఆస్వాదించేందుకు తెలుగు రాష్ట్రాలు నలుమూలల నుంచి ఆదివారం 13 పర్యాటక బోట్లల్లో సుమారుగా 900 మంది పర్యాటకులు వెళ్లారు. దీంతో పోశమ్మ గండి వద్ద, పోచవరం ఫెర్రి పాయింట్ దగ్గర పేరంటాలపల్లి శివాలయం (మునిమఠం) వద్ద పర్యాటకులతో పండుగ వాతావరణం ఏర్పడింది. గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, తోయ్యేరు. మూలపాడు, అగ్రహారం, మడిపల్లి, మంటూరు, కచ్చులూరు, తాళ్లూరు, గొందూరు, సుద్దకొండ, తెలిపేరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి చేరుకున్నారు. శివాలయంలో శివుడిని దర్శించుకుని ఆ గ్రామంలో గిరిజనులు తయారుచేసిన వెదురు బొమ్మలను కొనుగోలు చేశారు. ముందుగా ఆ గ్రామ పరిధిలో ఉన్న జలపాతాల వద్ద సందడి చేశారు.



భక్తుడు సమర్పించిన నక్లెస్

సత్యదేవుడికి నక్లెస్ బహూకరణ

అన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడి దేవేరి అనంతలక్ష్మి అమ్మవారి అలంకరణ నిమిత్తం ఆదివారం ఒక భక్తుడు నక్లెస్‌ను విరాళంగా అందజేశారు. నంద్యాల జిల్లాకు జనపల్లి గ్రామానికి చెందిన సి.రాముడు దీనిని ఈవో సుబ్బారావు, అకౌంట్స్‌విభాగ సూపరింటెండెంట్ యనమల అప్పారావు సమక్షంలో అందజేశారు. దీనిబరువు 24.8 గ్రాములుండగా కేవలం బంగారం 8.9 గ్రాములు ఉందన్నారు. ఇతర స్టోన్స్ విలువను లెక్కకట్టమని.. నికర బంగారం విలువ సుమారు రూ.1.05 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఈవో సుబ్బారావుకు నక్లెస్‌ను అందజేస్తున్న దాత

క్రీడాకారులు లక్ష్యాలను సాధించాలి

● 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ ● మహిళా బాస్కెట్‌బాల్ అంతర్ కళాశాలల పోటీలు, యూనివర్సిటీ జట్టు ఎంపికలు

దివాన్‌చెరువు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. విశ్వవిద్యాలయంలో మహిళా బాస్కెట్ బాల్ అంతర్ కళాశాలల పోటీలు, యూనివర్సిటీ జట్టు ఎంపికలు ఆదివారం నిర్వహించారు. హాజరైన వీసీ మాట్లాడుతూ క్రీడల ద్వారా నన్నయ విశ్వవిద్యాలయం ఔన్నత్యాన్ని జాతీయస్థాయిలో చాటిచెప్పే విధంగా కృషి చేయాలన్నారకు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేశారన్నారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 2 వరకూ బెంగుళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ మహిళా బాస్కెట్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. మహిళా బాస్కెట్ బాల్ అంతర్ కళాశాలల పోటీల్లో మొదటి స్థానం ఏలూరులోని సెయింట్ థెరిస్సా, రెండోస్థానం ఏలూరులోని సీఆర్ఆర్ కళాశాల, మూడోస్థానం ఆదిత్య మహిళా కళాశాల క్రీడాకారులు సాధించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, విశ్వవిద్యాలయం అధికార్లు, అధ్యాపకులు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయం బాస్కెట్ బాల్ జట్టుతో వీసీ ప్రసన్నశ్రీ, అధికారులు

నేడు, రేపు 'నన్నయ'లో జాతీయ కార్యశాల

హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దివాన్‌చెరువు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమ, మంగళవారాల్లో భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం అనే అంశంపై జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆదివారం విలేకర్లతో వీసీ మాట్లాడుతూ భారతీయ భాషా సమితి, న్యూఢిల్లీలోని విద్యామంత్రిత్వశాఖ సహకారంతో ఈ కార్యశాలను నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరై జాతీయ కార్యశాలను ప్రారంభిస్తారని చెప్పారు. ఆత్మీయ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్‌డి.విల్సన్, భారతీయ భాషా సమితి సీనియర్ ఎక్స్‌పర్ట్ ఆచార్య ఆర్‌ఎస్.సర్రాజు, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయ భాషాసమితి అకడమిక్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు దేశ నలుమూలల నుంచి తెలుగు, సంస్కృత భాషల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై మరింత అవగాహన పెంచుకునేందుకు విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులు, పాఠ్య పుస్తకాలు రచించిన విద్యావేత్తలు, భాషాభిమానులు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యశాల కోఆర్డినేటర్‌గా తలారివాసు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా కె.వరప్రసాద్, పి.రాజశేఖర్, ఎన్.నారాయణ, ఎం.రమేష్, ఆనంద్ వ్యవహరిస్తారని తెలిపారు.

అరగంటసేపు భయం భయం...

▸ ఎక్సలేటర్ వైరు తెగి గోదావరిలో నిలిచిపోయిన పంటు

▸ ప్రయాణికుల బెంబేలు ▸ మరో పంటు సాయంతో క్షేమంగా ఒడ్డుకు

అంతర్వేది, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి-నర్సాపురం వశిష్ట గోదావరి రేవు మధ్యలో ప్రయాణికులతో వెళ్తున్న పంటు ఆదివారం అరగంటసేపు నిలిచిపోయింది. పంటుకు ఉన్న ఎక్సలేటర్ వైరు తెగి ప్రయాణికులు వాహనాలతో ఆగిపోవడంతో భయాందోళన చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి సఖినేటిపల్లి రేవుల మధ్య నిత్యం వేలాది మంది పంటుపై ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం పంటు గోదావరిలో నిలిచిపోవడంతో వేరే పంటు సాయంతో నిలిచిపోయిన పంటును ఒడ్డుకు తీసుకువచ్చారు. సఖినేటిపల్లి రేవులో గోదావరిపై అంతర్వేది సాగర సంగమం నుంచి వచ్చే ఆటుపోట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నిలిచిపోయిన పంటు స్థిరంగా ఉండక పాటు సమయం కావడంతో నెమ్మదిగానే కదలిక సాగింది. అదే పోటు సమయంలో అయితే పంటు వేగానికి అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సుమారు 80 మంది ప్రయాణికులు, సుమారు 20 దిచక్రవాహనాలు, ఒక కారు పంటులో ఉన్నాయి. పంటును ఒడ్డుకు తీసుకురావడంతో వీరంతా ఊపిరి పీల్చుకున్నారు.



సఖినేటిపల్లి రేవులో పంటును వేరే పంటు సాయంతో ఒడ్డుకు తీసుకెళ్తున్న దృశ్యం

గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన

● చర్చిలు మూసివేయాలని డిమాండ్

● ఆరుగంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు

● తాత్కాలికంగా మూసివేతకు ఆదేశం

● పోలీసు పికెట్ ఏర్పాటు



ఆందోళనకు దిగిన హిందూ సంఘాల ప్రతినిధులు

గొల్లప్రోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన, అదే సమయంలో చర్చిల వద్దకు వెళ్లేందుకు క్రైస్తవులు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోలీసు బలగాలు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చర్చిలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆర్డీవో ఆదేశించారు. సుమారు ఆరుగంటల పాటు ఆందోళనలు, ఉద్రిక్తతలు కొనసాగాయి.

అసలేం జరిగిందంటే...

గొల్లప్రోలు కొత్తపేట ప్రాంతంలో ఉన్న రెండు చర్చిల నిర్వహణపై అక్కడ స్థానికులు కొంతకాలంగా అభ్యంతరం తెలుపుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా చర్చిలు నిర్వహిస్తున్నారని, లౌడ్‌స్పీకర్లు వినియోగిస్తున్నారని తెలిపారు. దీనిపై ఎటువంటి స్పందన లేకపోవడంతో హిందూ సంఘాలు ఆందోళన కు పిలుపునిచ్చాయి. హిందూ ధర్మ రక్షా సమి తి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవరయ్య ఆ ధ్వర్యంలో చర్చిల ప్రాంతంలో ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తతలు ఏర్ప డ్డాయి. అదే సమయంలో చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. దీంతో కాకినాడ రూరల్, త్రీ టౌన్ సీఐలు చైతన్యకృష్ణ, సత్యనారాయణల ఆధ్వర్యంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్‌ఐలు రామకృష్ణ, మణికుమార్, లోకేష్, వెంకటేష్ అక్కడకు చేరుకున్నారు. హిందూ సంఘాలతో చర్చలు జరిపారు. చర్చిలు మూసివేసే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ గవరయ్య స్పష్టం చేశారు. చర్చిల్లో ఉన్న వారిని బయటకు పంపివేశారు. కొంత సమయం తర్వాత క్రైస్తవులు అక్కడకు చేరుకునేందుకు గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం నుంచి తరలివచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు.

ఆర్డీవో చర్చలు

విషయం తెలుసుకున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, గొల్లప్రోలు తహశీల్దార్ రామ్‌కుమార్, నగరపంచాయతీ టీపీవో దీప్తి కొత్తపేటకు చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చలు జరిపారు. చర్చిలకు అనుమతులు లేవని, ఆక్రమణలు ఉన్నాయని హిందూ సంఘాల ప్రతినిధులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో ఉన్న రెండు చర్చిలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు. అదేవిధంగా కొత్తపేట ప్రాంతంలో సీఆర్‌పీసీ 144వ సెక్షన్ కింద నిషేదాజ్ఞలు విధించారు. ఆక్రమణలు ఉన్నాయన్న ఫిర్యాదుల మేరకు సర్వే నిర్వహించి మార్కింగ్ చేయాలని టీపీవోను ఆర్డీవో ఆదేశించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో చర్చిల నిర్వాహకులతో చర్చలు జరిపారు. కలెక్టర్‌ను సోమవారం కలవాలని సూచించారు. మరోవైపు ఆర్డీవో హామీతో హిందూ సంఘాలు ఆందోళన విరమించాయి. అక్కడ ఏ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు గానూ ముందుజాగ్రత్త చర్యగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.



చర్చిల నిర్వాహకులతో చర్చలు జరుపుతున్న ఆర్డీవో

వంద పువ్వులే... వికసించెలే..

కొత్తపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన పురోహితుడు పెద్దింటి రామం ఇంటి పెరటిలో వేసిన బ్రహ్మకమలం మొక్కకు ఒకేసారి 100 పువ్వులు వికసించడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రామం ఈ మొక్కను 4 సంవత్సరాల కితం చెన్నై నుంచి ప్రత్యేక తెప్పించుకున్నారు. గత నాలుగేళ్లలో ఇప్పటి వరకూ 5వేల వరకూ పువ్వులు వికసించాయని, ఆదివారం 100 పుష్పాలు వికసించాయన్నారు. ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో సంరక్షణ చేయడంతో ఆరోగ్యకరంగా మొక్క పెరిగి పుష్పాలతో విరబూస్తుందని, ఇది శుభసూచికమని తెలిపారు.



మన్యంలో పెరిగిన చలి

మోతుగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు దట్టంగా కమ్ముకుంటుంది. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో మంచు దెబ్బకు వాహనాలు నెమ్మదిగా ప్రయాణించవలసి వస్తుంది. చలి తీవ్రతంగా కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. అయితే మంచులో అందమైన దృశ్యాలు కనిపించడంతో పలువురు కెమెరాలతో ఇక్కడ షూటింగ్‌లు చేస్తున్నారు.





మోతుగూడెం- పొల్లూరు మార్గంలో పొగమంచు దృశ్యాలు

ధాన్య పరమేశ్వరుడిగా రామలింగేశ్వరస్వామి

ధాన్యం, వరి కంకులతో అలంకారం





స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైన పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి ధాన్యపరమేశ్వరుడి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు నిర్వహించారు. వరి కంకులు, ధాన్యంతో ధాన్య పరమేశ్వరుడిగా అలంకారం చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. రైతులు పండించే ఆహార ధాన్యాల పంటలు సక్రమంగా చేతికందాలని కోరుతూ ఈ అలంకారం చేసినట్టు ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో ఆదివారం మోటూరి భైరవస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి 3 స్థానాల్లో నిలిచిన వారిని విజేతలుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, నేషనల్ యోగా జడ్జి మోటూరి భైరవస్వామి ప్రకటించారు. జాతీయస్థాయిలో జరిగే పోటీలకు 8మందిని ఎంపిక చేసినట్టు వివరించారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో బి.మధు, ఎస్.శ్రావణి, కె.సురేంద్ర, ఎం.అనిల్‌కుమార్, ఎ.ప్రవల్లిక, కె.దుర్గాభవాని, సీహెచ్.నరేంద్రకుమార్, పి.హర్షవర్ధన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రథమస్థానం సాధించిన విద్యార్థులు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈనెల 28న రాజమహేంద్రవరంలో జరిగే పోటీలకు పంపనున్నట్టు తెలిపారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో యోగా గురువు భైరవస్వామి

స్కూల్‌గేమ్స్‌లో యానాం విద్యార్థుల ప్రతిభ

యానాం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2025-26 పోటీల్లో యానాం విద్యార్థులు ప్రతిభ సాధించారు. వెయిట్ లిఫ్టింగ్ 53 కిలోల విభాగంలో యానాం విద్యార్థిని సీహెచ్.మహాశరణ్య ప్రథమస్థానం, 48 కిలోల విభాగంలో వి.ఎల్.ధనశ్రీ, 44కిలోల విభాగంలో ఎమ్.సూర్యకార్తీ, 98 కిలోల విభాగంలో ఎం.సురేష్ తృతీయస్థానం కైవసం చేసుకున్నారు. బాలురు అండర్ 17వాలీబాల్ విభాగంలో ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు.



వాలీబాల్ విభాగంలో ప్రతిభ సాధించిన యానాం విద్యార్థులు

పంటకాల్వలోకి దూసుకెళ్లిన కారు

యువకుడి మృతి



శ్యామ్‌తేజ (ఫైల్)

రాజోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం కడలిలో పంట కాల్వలోకి ఆదివారం కారు దూసుకెళ్లడంతో శ్యామ్‌తేజ (20) మృతిచెందాడని రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. ములికిపల్లికి చెందిన కలిగితి శ్యామ్‌తేజ కారులో పి.గన్నవరం వెళ్లి ములికిపల్లికి వస్తుండగా కడలి పెట్రోలు బంకు సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న ప్రధాన పంటకాల్వలోకి దూసుకెళ్లడంతో శ్యామ్‌తేజ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.



పంటకాల్వ నుంచి బయటకు తీసిన కారు

అమలాపురం

ప్రారంభం కాకుండానే శిథిలమయ్యేనా...



పి.గన్నవరం సబ్‌డివిజన్ కార్యాలయంలో వెనుక నిరుపయోగంగా ఉన్న ఇరిగేషన్ సిబ్బంది క్వార్టర్లు

- లక్షలు వెచ్చించారు...లక్ష్యాన్ని మరిచారు
- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాని భవనాలు



మొండెపులంకలాకులో నిరుపయోగంగా ఉన్న ఇరిగేషన్ సిబ్బంది క్వార్టర్లు

పి.గన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆ భవనాలను ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించింది. కానీ నేటికీ ఆ భవనాల లక్ష్యం నేరవేరలేదు. ఏళ్లు గడుస్తున్నా ఆ భవనాలను అధికారులు అందుబాటులోకి తీసుకురాలేదు. ఇది పి.గన్నవరంలో ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని సిబ్బంది క్వార్టర్స్ పరిస్థితి. ప్రస్తుతం ప్రభుత్వ భవనాలు ప్రారంభం కాకుండానే శిథిలమయ్యే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం(2009-2014) హయాంలో లష్కర్లు నివాసం ఉండేందుకు సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 40 భవనాలను నిర్మించారు. పి.గన్నవరంలో అయితే ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయం వెనుక, గంటిరోడ్డులో ప్రధాన రహదారి చెంతన, మొండెపులంకలాకుల్లో సిబ్బంది క్వార్టర్స్‌ను నిర్మించారు. పి.గన్నవరంలో హెడ్‌వర్క్స్ కార్యాలయం శిథిలమైపోవడంతో సంబంధితశాఖ అధికారులు ఓ భవనాన్ని వాడుకుంటున్నారు. మరోపక్క గంటి రోడ్‌లో ఉన్న ఇరిగేషన్ క్వార్టర్స్‌వెనుక స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ఉండటం విశేషం. మొండెపులంక లాకుల్లో ఒక్క లష్కరు మాత్రమే భవనాన్ని ఉపయోగించుకుంటున్నాడు. మరో భవనం లాక్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని వాడుకుంటున్నట్లు సమాచారం. మిగిలిన భవనాలు నిరుపయోగంగానే ఉన్నాయి. ఈభవనాలకు అప్పట్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోవడం ఒక సమస్య అయితే మరో ప్రక్క ఆ భవనాల్లో ఉండేందుకు సిబ్బంది నిరాకరించడం మరో సమస్య. దీంతో క్వార్టర్స్ నిరుపయోగంగా ఉండిపోయాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆ భవనాలు నిరుపయోగంగా ఉండటంతో పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. క్రమేపి లష్కర్లు పదవీ విరమణ చేయడంతోపాటు ప్రభుత్వం కొత్త లష్కర్లను నియమించకపోవడంతో లష్కర్లు సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం సబ్‌డివిజన్ పరిధిలో పర్మినెంట్ లష్కర్లు సుమారుగా పదిమంది ఉన్నారు. మిగిలిన వారు కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకున్న లష్కర్లు మాత్రమే పనిచేస్తున్నారు. క్వార్టర్స్ అందుబాటులోకి తెచ్చినప్పటికీ ఉండేందుకు సిబ్బంది లేకపోవడం గమనార్హం. మరో పక్క ప్రభుత్వ సొమ్ము అక్కరకు రాకుండాపోయిందని పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

- ముఖ్యఅతిథిగా ఐవీ

అయినవిల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అయినవిల్లి మండలశాఖ నూతన కౌన్సిల్ సమావేశం ఆదివారం ముక్తేశ్వరం బీఈడీ కళాశాల ప్రాంగణంలో జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావిధానంపై అనుసరిస్తున్న నిర్లక్ష్యం వల్ల విద్యాభివృద్ధికి విఘాతం కలుగుతుందని, వాటిని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరీక్షల విధానాన్ని సంస్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక స్కీముల ఏర్పాటు ద్వారా ఉపాధ్యాయులను మానసిక హింసలకు గురిచేస్తున్నారని, అటువంటి వేధింపులను ఉపాధ్యాయులు సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల నూతనశాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అయినవిల్లి మండలశాఖ గౌరవాధ్యక్షుడిగా గుబ్బల సాయిశ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంఎస్ఎస్ కిరణ్‌బాబు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా కుడుపూడి నాగలక్ష్మి, అధ్యక్షులు టీబీ ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బీర సందీప్, ఆర్థిక కార్యదర్శిగా ఎం.కిరణ్‌తేజ, జిల్లా కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర శ్రీను, జిల్లా కార్యదర్శులు పి.మురుగేశ్వరరావు, సీహెచ్ కేశవరావు, వై.మురళీ, బి.చంద్రకళ, బొక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మామిడికుదురు నుంచి ఎస్టీయూ సదస్సుకు బయలుదేరిన ఉపాధ్యాయులు

మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు చిక్కం రవికుమార్ కోరారు. ఎస్టీయూ 79వ జిల్లా కౌన్సిల్ సమావేశాలకు మామిడికుదురు నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు, విద్యార్థుల సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యమని ఈ సందర్భంగా అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి నేల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మట్టా నాగరాజు, కారుపల్లి కల్యాణ్‌బాబు, గంటా వెంకన్న, కాపవరపు రాధాకృష్ణ, తోట ప్రసాద్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణేశ్వరం శివాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు

అల్లవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): లక్ష్మణేశ్వరం పార్వతీ సమేత శివాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. ఆలయ పూజారి దొంతికుర్తి రమేష్ పర్యవేక్షణలో ఆదివారం అభిషేకాలు, ఆరుద్ర పూజలకు పలు గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు.



ఎస్టీయూ పట్టణశాఖ నూతన కార్యవర్గం

ఎస్టీయూ పట్టణశాఖ అధ్యక్షుడిగా పోలిశెట్టి

అమలాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ పట్టణ శాఖ సర్వసభ్య సమావేశం అమలాపురం సర్దార్ భగత్‌సింగ్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం 2026సంవత్సరానికి పట్టణశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణశాఖ అధ్యక్షుడిగా బీవీఎస్‌సీ పోలిశెట్టి, గౌరవాధ్యక్షుడిగా కేఆర్ఎన్ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా ఆర్.దుర్గ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంఎస్ఎన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నక్కా బాలకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా కేఎస్ఎన్ మూర్తి, అభయ్ కన్వీనర్‌గా వై.సుదర్శనరాజు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా బీఆర్ రమాకాంతరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎంఎస్ఎన్ మూర్తి, సరాగుల గోపీరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, సీనియర్ నాయకులు కాశి వెంకట్రావు, ఎంఎంకేజీ మొయినుద్దీన్, ఎన్.సుమతి, సూర్యకాంతం, పి.ఆదివిష్ణు, కేవీవీ సత్యనారాయణపాల్గొన్నారు.

అరబిందో బకాయిలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న 104 ఉద్యోగులు

అమలాపురంటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగులకు అరబిందో సంస్థ నుంచి రావాల్సిన బకాయిలను ప్రభుత్వమే ఇప్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న సిబ్బందిపై నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు. ఉద్యోగులందరికీ నియామక పత్రాలు అందించాలని, జీతభత్యాలు తెలిపే విధంగా పేస్లిప్‌లు ఇవ్వాలని, ఎటువంటి అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్లను మందుల నిర్వహణ బాధ్యత నుంచి తొలగించాలని, ప్రతీ డివిజన్‌కు ఒక బఫర్ సిబ్బందిని నియమించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోరుకునేది హిందువులే..


- పీఠాధిపతి సాయిదత్త నాగానందసరస్వతీస్వామిజీ



హిందూ ధర్మాన్ని ప్రబోధిస్తున్న స్వామిజీ

ముమ్మిడివరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజాన్ని సంఘటితం చేయాల్సిన అవసరం ప్రతీ హిందువుపైనా ఉందని శృంగవృక్షం పంచమ పీఠాధిపతి సాయిదత్త నాగానందసరస్వతి స్వామిజీ ప్రబోధించారు. ముమ్మిడివరంలోని మహిళా కళాశాలల ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెన్మెత్స జగ్గప్పరాజు అధ్యక్షతన హిందూ సమ్మేళనంలో సరస్వతీ స్వామిజీ పాల్గొని హిందూ ధర్మతత్వాన్ని ప్రబోధించారు. ధర్మాన్ని, సత్యాన్ని ఆచరించాలని ప్రబోధించేది హిందూ తత్వం మాత్రమేనన్నారు. విశ్వశాంతి కోసం లోకల్యాణం కోరకునేవారు హిందువులన్నారు. హిందూ ధర్మపరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సెక్రటరీ అత్తిపట్ల వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వ్యక్తి నిర్మాణంచేసి దేశానికి సేవ చేసే సంస్థగా నిలిచిందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా నిలిచి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన విశేషంగా అలంరించింది. కార్యక్రమంలో గొలకోఇ వెంకటరెడ్డి, దంగుడుబియ్యం శ్రీనివాసరావు, పెన్మెత్స కృష్ణంరాజు, ఆదిరాజు సతీష్, పుల్లెల వెంకటనరసింహశాస్త్రి, సన్నిధి రాజు, వీరభద్రశర్మ, ఆర్ఎస్ఎస్ ముమ్మిడివరం ఖండ ధర్మ ప్రచారక్ బొంతు కనకారావు, ఏలూరి రాంబాబు, నరసింహస్వామి, పాల్గొన్నారు.

అమృతలింగేశ్వరస్వామికి జలాభిషేకం



అప్పనపల్లిలో సత్యలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరమశివుడు ఉద్భవించినరోజు మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం రోజును పురస్కరించుకుని అప్పనపల్లి వైనతేయ నదీతీరంలో ఉన్న శ్రీఉమా అమృతలింగేశ్వరస్వామికి 108 కలశాల గోదావరి జలాలతో అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది 2005 నుంచి శ్రీశివకేశవ భక్త బృందం ఆధ్వర్యంలో శివుడు ఉద్భవించిన రోజున ప్రత్యేక పూజలు ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం లక్ష రుద్రాక్ష పూజ, కోటిపంచాయక్షరీ జపం, తర్పనం, హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. లక్ష రుద్రాక్షలతో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శత సహస్ర బిల్వార్చన పూజలు



వక్కలంకలో అభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

అంబాజీపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం వక్కలంక గ్రామంలో ఉన్న ఏకాదశ రుద్రులలో 4వ రుద్రుడైన త్రిపురాంతక రుద్రుడు, శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం అష్టోత్తర, శ్రీరుద్ర సువర్ణ అభిషేక పూర్వక శత సహస్ర బిల్వార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు కొంపెల్ల సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో 108లీటర్ల ఆవుపాలు, ఆవుపెరుగు, పంచదార, తేనె, చెరుకురసం, విభూది, గంధం, కొబ్బరినీళ్లు, ద్రాక్షరసం, పన్నీరు, పుష్ప ఉదకం, తదితర ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం మేళతాళ మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. అనంతరం ఆలయంవద్దభక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

‘దివ్యాంగ పిల్లలపై ప్రత్యేకశద్ధ చూపించాలి’



బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశం

అమలాపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బండారులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని భవితకేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. స్కూలు కాంప్లెక్సు హెచ్‌ఎం ఎస్ఎల్‌వీ బాల అధ్యక్షతన, భవిత స్కూలు ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, కులప ధరణి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించగా ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. దివ్యాంగ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. దేవగుప్తం గ్రామానికి చెందిన కడలి వీరవెంకటసత్యనారాయణ భవిత స్కూలు పిల్లల కోసం రూ.10వేలు విలువ చేసే వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, ప్రాథమిక స్కూలు హెచ్‌ఎం సీహెచ్ ఆచార్యులు, సీఆర్పీలు గూటం నాగన్న, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

9న మార్కెట్‌యార్డులో ఉచిత వైద్య శిబిరం

అంబాజీపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మిస్సమ్మ(స్త్రీల) ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ ఐరీన్ లీజర్ 99వ జయంతి సందర్భంగా ఈనెల 9న లీజర్ మోమోరియల్ హాస్పటల్ ఆధ్వర్యంలో అంబాజీపేట మార్కెట్‌యార్డులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హెవార్డు తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, కంటి వైద్యం, దంత వైద్యం, రేడియాలజీ, కార్డియాలజీ, ఫిజియోథెరపీ ఆర్థోపెడిక్ తదితర విభాగాలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సాధారణ ఫీజుతో స్కానింగ్ తీస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసీపీకి పలువురు రాజీనామా

అంబాజీపేట, డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): అంబాజీపేట మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆది వారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను వైసీపీ మండలాధ్యడికి అందజేసినట్లు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో మాచవరం ఎంపీటీసీ మట్టా పార్వతీ, సీనియర్ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఉందుర్తి నాగబాబు, చిల్లే శ్రీనివాసులు పార్టీకి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో పార్టీలో ఉండలేకపోతున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు.

నెవా డ్రెయిన్ పూడికతీతపై దృష్టి పెట్టాలి

అంతర్వేది, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది నెవా డ్రెయిన్, రాళ్లకాల్వల్లో పూడికతీతపై దృష్టి పెట్టాలని రైతుసంఘం నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. స్థానిక మాజీ జడ్పీటీసీ చెల్లుబోయిన కేశవశెట్టి ఆధ్వర్యంలో నీటిసంఘ డైరెక్టర్ యెనుముల సింహాచలం (బుజ్జి), నీటి సంఘాల ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆక్వా రైతులు ప్రత్యేక సమావేశమై అధికారులు, ప్రజాప్రతినిధులను నెవా డ్రెయిన్ పూడికతీత పనులు జరిగేలా కృషి చేయాలని కోరారు. సుమారు 11 కిలోమీటర్ల పొడవున పూడికతీత పనులు చేపట్టినట్లయితే ఐదు గ్రామాల ప్రజలు ముంపునకు గురవకుండా సురక్షితంగా ఉండగలుగుతారని సమావేశంలో పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా నెవా డ్రెయిన్ పూడికతీత తీయకపోవడంతో పోటునీరు వచ్చి తిరిగి మళ్లీ పాటు సమయంలో వెళ్లకపోవడంతో నిత్యం ఐదు గ్రామాలు ముంపులోనే మగ్గుతున్నాయి. దీనిపై అందరూ కలసికట్టుగా పూడికతీత తీసేందుకు కృషి చేసినట్లయితే తీర ప్రాంత గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని తెలిపారు. ఎంపీటీసీ బాబూరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, మాజీ ఎంపీటీసీ రావి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

సహృదయ సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ



నగరం దీవి పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మామిడికుదురుకు చెందిన సహృదయ సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నగరం దీవి (ద్వితీయభాగం) పుస్తకావిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. మామిడికుదురులోని బోయిభీమన్న మానవ వనరుల కేంద్రంలో జరిగిన ప్రముఖ వైద్యుడు బసవా వరహాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత భజరంగ్ లాల్ బియానీ రచించిన ఈ పుస్తకాన్ని పాశర్లపూడి రామగంగ ట్రస్టు ముద్రించింది. కార్యక్రమంలో డాక్టర్ వరహాలు మాట్లాడుతూ భావితరాలకు చరిత్రను తెలియజేసే రచనలను ప్రతీ ఒక్కరూ స్వాగతించాలని కోరారు. నగరం దీవి చరిత్రను రచయిత సమగ్రంగా పుస్తకంలో పొందు పరిచారని, చాలామందికి తెలియని విషయాలను పుస్తకం ద్వారా తెలియచెప్పారన్నారు. కార్యక్రమంలో ద్విభాష్యం కల్యాణి, కళావేదిక అధ్యక్షుడు పెదమల్లు నాగబాబు, కార్యదర్శి యేడిద కవీంద్ర, చెరుకూరి సూర్యనారాయణశర్మ భావరాజు సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు పాల్గొన్నారు.

డాక్టర్ రవికుమార్‌కు ఉత్తమ ఫిజియోథెరపిస్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఎస్.రవికుమార్

రాజోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చింతలపల్లికి చెందిన ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఎస్.రవికుమార్‌కు ఉత్తమ ఫిజియోథెరపిస్టు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ ఆదివారం మాట్లాడుతూ అమలాపురంలో కిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదరన్ ఫిజియో వార్షిక పరిశోధన సంస్కృతిక సమావేశంలో ఉత్తమ ఫిజియో థెరపిస్టుగా తనను గుర్తించి అవార్డును అందజేశారని తెలిపారు. రాజోలులో గత పదిహేను సంవత్సరాలుగా రవి ఫిజియోథెరపీ సెంటర్ ద్వారా వైద్య సేవలు అందజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

పవర్ కిక్‌లో మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లతో విద్యార్థులు

అమలాపురంటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అనపర్తి టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం జపాన్ షోటోకాన్ ఆర్గనైజేషన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో అటల్‌జీ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు అమలాపురానికి చెందిన చిక్కం సురేష్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. వివిధ జిల్లాలకు చెందిన 800 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అమలాపురం పవర్‌కిక్ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొని వారంతా వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్టు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. ప్రతిభ కనబరిచిన పవర్‌కిక్ విద్యార్థులను పలువురు అభినందించారు.

ఉపకరణాల పంపిణీ

యానాం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యానాం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంఘిక సంక్షేమాధికారి సూరంపూడి రాజేంద్ర ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన కృత్రిమ ఉపకరణాల తయారీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలిమ్‌కో)సంస్థ తయారుచేసిన వివిధ రకాల ఉచిత ఉపకరణాలను అర్హులైన వారికి అందించారు. స్థానిక జ్యోతిరావు పూలే బీసీ వసతి గృహం వద్ద 350 మంది లబ్ధిదారులకు సుమారు 25లక్షల విలువచేసే 1460 ఉపకరణాల పంపిణీ ప్రారంభించారు. వీటిలో 230 వీల్ ఛైర్లు, 300 మూడు చక్రాల సైకిళ్లతోపాటు ఇతర ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుదుచ్చేరి అలిమ్‌కో టెక్నీషియన్ నాయక్, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా సాధికారిత, చైల్డ్‌లైన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నల్లా శ్రీధర్

అమలాపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దోనూరి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న ఎస్ఎస్‌నాయుడు లేఅవుట్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. జనసేన సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ శిబిరాన్ని ప్రారంభించారు. భార్య కోసం భర్త.. తల్లి కోసం బిడ్డ.. పేరిట నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 113 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ప్రత్యేకంగా అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. విశిష్ట అతిథిగా హాజరైన పట్టణ సీఐ పి.వీరబాబు రక్తదాతలను ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాలను అందజేయగా మాజీ మున్సిపల్ చైర్మన్లు యాళ్ల నాగసతీష్ రక్తదానం చేయడం విశేషం. కార్యక్రమంలో కూటమి నాయకులు లింగోలు పండు, కల్వకొలను తాతాజీ, నల్లా అజయ్, నల్లా సంజయ్, కంచిపల్లి అబ్బులు, యేడిద రాజా, గట్టిం వీరు, ఆశెట్టి ఆదిబాబు, కొప్పుల నాగమానస తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యసాయి వ్రతాలు

మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మొగలికుదురులోని శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో సామూహిక సత్యసాయి వ్రతాలు ఆదివారం ఘనంగా జరిగాయి. భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ వ్రతాలు నిర్వహించి విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, రంగవల్లులు, పాటలు తదితర పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందజేశారు. భారీసంఖ్యలో సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



మాచవరంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భవానీ భక్తులు

అంబాజీపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామదేవతలు శ్రీ ఇటికాలమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు భవానీలు ఆదివారం సారె సమర్పించారు. గురుభవానీలు దంగేటి సాయిబాబు-మల్లేశ్వరి దంపతులు, మట్టపర్తి దుర్గారావు(ఏసు)ల ఆధ్వర్యంలో గ్రామస్థులు, భవానీలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి చలివిడి పానకాలు, చీర, గాజులు, పువ్వులు, స్వీట్లును సమర్పించారు. అంబాజీపేట భవానీ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



ఎస్.యానాంలో అభయాంజనేయస్వామిని పూజిస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాంలో ఆదివారం అభయాంజనేయస్వామి 17వ వార్షిక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆంజనేయస్వామికి తమలపాకుల పూజలు, విశేష అభిషేకాలు జరిగాయి. ఆంజనేయస్వామిపై పూలవర్షం కురిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం

కాట్రేనికోన, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నడవపల్లిలో శ్రీకోదండరామస్వామి, శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర ఉత్సవం సందర్భంగా ఆదివారం ప్రధాన అర్చకుడు భైరవభొట్ల బ్రహ్మాజీ పర్యవేక్షణలో అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పూజ్యం విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కుల మంత్రోచ్చారణ మధ్య అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్వేది హార్బర్‌కు విద్యుత్ సరఫరా



విద్యుత్ వెలుగులతో అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరు

అంతర్వేది, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు కోట్ల రూపాయలతో అంతర్వేది పల్లిపాలెంలో మినీ ఫిషింగ్ హార్బరు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి దశలవారీగా హార్బరు నిర్మాణం జరిగి భవనాలు ఏర్పాటై బోట్లు వస్తూ మత్స్య సంపద ఎగుమతులు వివిధ రాష్ట్రాలు, దేశాలకు జరుగుతున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్ఆర్ ఏజెన్సీకి మినీ ఫిషింగ్ హార్బరు నిర్వహణను అప్పగించడంతో తొలిసారి హార్బరుకు విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నేతృత్వంలో హార్బరు అభివృద్ధికి మరింత మెరుగైన సౌకర్యాలు రానున్నాయి. ఆదివారం విద్యుత్ వెలుగుల్లో హార్బరు వ్యాపార శోభాయమానంగా మారింది. దీంతో మత్స్యకారుల ఆనందానికి అవధుల్లేవు. త్వరలోనే పూర్తిస్థాయి సౌకర్యాలతో హార్బరు నిర్వహణతోపాటు మత్స్యకారులు జీవనోపాధి మెరుగు పడుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

మండపేట



రావులపాలెం టీడీపీ కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

పేదలకు సీఎం సహాయనిధి అండ

రావులపాలెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతో తోడ్పడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 40 మందికి రూ.15.92 లక్షల చెక్కులను అందచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల నేతృత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

రాయవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అష్టసోమేశ్వర ఆలయంగా విరాజిల్లుతున్న సోమేశ్వరం శ్రీబాల త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల ద్రవాలతో అభిషేకాలు, అర్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉత్సవ కమిటీ చైర్మన్ రావుల రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో భవానీ శంకర అష్టలింగేశ్వరస్వామికి పంచద్రవ్యాలతో రుద్రాభిషేకం, బిల్వార్చన జరిపారు. విజయదుర్గా అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరంలోని సోమేశ్వరస్వామివారు

కుక్కల స్వైరవిహారంతో ప్రజల బెంబేలు

కె.గంగవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాహనాల వెంట పరిగెడుతూ వారిని హడలెత్తిస్తున్నాయి. ఇటీవల మండలంలోని పలు ప్రాంతాల్లో కుక్కకాటు పడిన వారి సంఖ్య భారీగా నమోదైనట్టు తెలిసింది. గంగవరం, పాణింగపల్లి, అముజూరు, సత్యవాడ, పామర్రు తదితర గ్రామాల్లో గుంపులుగా తిరుగుతూ వాహనదారులను, స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట వాహనాలపై వెళుతున్న వారిని వెంబడిస్తుండటంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



అముజూరులో కుక్కల గుంపు



కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర

రోడ్డు ప్రయాణాల్లో నియమాలు పాటించాలి

కొత్తపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు ప్రయాణాలు చేసేటప్పుడు అన్ని జాగ్రత్తలతో పాటు భద్రతపై దృష్టిపెట్టాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. కొత్తపేటలో వాహనదారులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఎక్కువన్నారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వవద్దని పోలీసు అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.




అంకంపాలెంలో విత్తనశుద్ధి నిర్వహిస్తున్న రైతులు

సామూహిక విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంకంపాలెంలో రైతులు సామూహిక విత్తన శుద్ధి చేశారు. దీన్ని చేపట్టడం ద్వారా పంటలకు జరిగే మేలును వివరించడంతో పాటు తెగుళ్ల నివారిస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు గంగాభవాని, లక్ష్మీదుర్గ, విజయలక్ష్మి పేర్కొన్నారు. నారుమడి వేసిన 10 రోజుల వరకూ తెగుళ్లు ఆశించకుండా ఉంటుందన్నారు. రైతులంతా సామూహిక విత్తనశుద్ధి చేశారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు

లోక కల్యాణం కోరుకునేది హిందువులే..

• పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతిస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజి

ముమ్మిడివరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజాన్ని సంఘటితం చేయాల్సిన అవసరం హిందువులపై ఉందని శృంగవృక్షం పంచమ పీఠాధిపతి సాయిదత్త నాగానందసరస్వతి స్వామిజీ అన్నారు. ముమ్మిడివరంలోని మహిళా కళాశాలల ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెన్మెత్స జగ్గప్పరాజు అధ్యక్షతన హిందూ సమ్మేళనంలో స్వామిజీ మాట్లాడారు. ధర్మాన్ని, సత్యాన్ని ఆచరించాలని ప్రబోధించేది హిందూ తత్వం మాత్రమేనన్నారు. హిందూ ధర్మపరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సెక్రటరీ అత్తిపట్ల వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వ్యక్తి నిర్మాణంచేసి దేశానికి సేవ చేసే సంస్థగా నిలిచిందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా నిలిచి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన విశేషంగా అలంరించింది. కార్యక్రమంలో గొలకోటి వెంకటరెడ్డి, దంగుడుబియ్యం శ్రీనివాసరావు, పెన్మెత్స కృష్ణంరాజు, ఆదిరాజు సతీష్, పుల్లెల వెంకటనరసింహశాస్త్రి, సన్నిధి రాజు, వీరభద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

రబీసాగుకు రైతులు సన్నద్ధం



మండపేట మండలంలో బోరుపై వేసిన వరినారుమడి

మండపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు తుపాన్‌ల మధ్య ఖరీఫ్ గట్టెక్కుతున్న వేళ అన్నదాతలు రబీసాగుకు శ్రీకారం చుడుతున్నారు. ఖరీఫ్ వరికోతలు నెలాఖరుకు పూర్తికానున్నాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రబీసాగుకు సంబంధించి జిల్లా వ్యవసాయశాఖ అంచనాలను సిద్ధం చేసింది. సాగునీటి ఎద్దడితోపాటు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టి ంది. జిల్లా వ్యాప్తంగా రబీసాగు విస్తీర్ణం 1.72 లక్షలు ఎకరాలు సాగు చేస్తారని అంచనా. దానికి అనుగుణంగా ఎరువులు, విత్తనా లు సిద్ధం చేసేందుకు కార్యాచ రణ రూపొందించారు. ఎక్కువగా రబీలో ఎంటీయు 1121, ఎంటీయు 2636 బొండాలు రకం సాగు చేస్తుంటారు. వ్యవ సాయశాఖ అధికారులు మాత్రం బొండాలు బదులుగా సన్నరకాలు సాగు చేయాలని రైతులకు వారు సూచిస్తున్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు: ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో పలుచోట్ల యూరియా కొరత రావడం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారు. సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా సరఫరా చేసినా కూడా కొరత ఏర్పడింది. కొంత మంది రైతులు ముందస్తుగా యూరియాను నిల్వ చేసుకోవటం మరికొంత మంది రైతులు వేర్వేరు పంటలకు యూరియాను తరలించటం వల్ల యూరియా కొరత ఏర్పడిందని వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఈసారి మాత్రం యూరియా కొరత రాకుండా వ్యవసాయశాఖ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. యూరియా కొరత లేకుండా చూసేందుకు వ్యవసాయశాఖ రైతు ఆధార్‌కార్డు, ఈక్రాప్ ఆధారంగా రైతులకు యూరియా అందజేయనున్నారు. దీనివల్ల యూరియా వినియోగంపై నియంత్రణ ఉండటం వల్ల కొరత ఏర్పడబోదని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. రైతులు వరినాట్లతో పాటు వెదజల్లే విధానం ద్వారా ఈసారి ఎక్కువగా వరిసాగు చేసే అవకాశాలు వున్నాయి. ఇప్పటికే మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో వరికోతలు చాలావరకు పూర్తి కావడంతో రైతులు రబీ వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే బోర్లపై వరినారుమడులు వేసుకుంటూ దమ్ములు సిద్ధం చేసుకుంటున్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం

వ్యవసాయ సంచాలకులు బోసుబాబు

రబీసాగుకు సంబంధించి ఎరువులు, విత్తనాల కొరత రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ సంచాలకులు వి. బోసుబాబు తెలిపారు. యూరియా విచ్చలవిడి వినియోగాన్ని అరికట్టేందుకు అవకాశం లేకుండా రైతుల అవసరాల మేరకు మాత్రం యూరియాను సాగును బట్టి అందిస్తామని ఆయన చెప్పారు.

9న ఉచిత వైద్య శిబిరం

అంబాజీపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మిస్సమ్మ(స్త్రీల) ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ ఐరీన్ లీజర్ జయంతి సందర్భంగా 9న లీజర్ మెమోరియల్ హాస్పటల్ ఆధ్వ ర్యంలో అంబాజీపేట మార్కెట్ యార్డులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హెవార్డు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆలమూరుకు చెందిన కాళ్లకూరి సూరిపండును సత్కరిస్తున్న దృశ్యం

కాళ్లకూరికి ఘన సత్కారం

ఆలమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆలమూరు విక్రమ భట్టేశ్వరస్వామి ప్రధానార్చకుడు, శైవాంగ పండితుడు కాళ్లకూరి సూరిపండును అనపర్తి మండలం పెడపర్తిలో జరిగిన జరుగుతున్న కోటి బిల్వార్చనలో సత్కరించారు. ఆదివారంనాడు యలమంచిలి కృష్ణమూర్తిశివాచారి నేతృత్వంలో 41 రోజుల పాటు పెడపర్తిలో శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు అధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో వేదపండితుల సత్కారంలో భాగంగా సూరిపండుని సత్కరించారు.



ఆలమూరు మండలం పినపళ్ల వద్ద డ్యామ్ ఎత్తును సరిచేస్తున్న దృశ్యం

రైతుల వివాదం పరిష్కారం

ఆలమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాల రైతుల మధ్య తలెత్తిన సాగునీటి వివాదం ఎట్టకేలకు పరిష్కారం అయ్యింది. పినపళ్ల, వెదురుమూడి గ్రామాల రైతుల మధ్య కాలువపై ఉన్న డ్యామ్ ఎత్తు పెంపుదలపై వివాదం ఏర్పడి ఒకరినొకరు కేసులు పెట్టుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు, ఆలమూరు ఇరిగేషన్ ఏఈ కృష్ణత్రిమూర్తులు సమస్య పరిష్కరించడానికి డ్యామ్ ఎత్తును పినపళ్ల భూములు, కాలువ ఎత్తు ఆధారంగా నిర్ణయించి సరిచేశారు. దీంతో రెండు గ్రామాల రైతుల మధ్య సమస్య పరిష్కారం అయినట్టు తెలిపారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం డైరెక్టర్లు జంగం రామారావు, సూరపురెడ్డి తాతానాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నీమాస్త్రం తయారు చేస్తున్న దృశ్యం

చీడపీడ పురుగుల నివారణకు 'నీమాస్త్రం'

ఆలమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చీడపీడ పురుగుల నివారణకు నీమాస్త్రం ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ ఎఫ్ఎంటీ సూర్యప్రకాష్ తెలిపారు. ఆలమూరులో సేంద్రియ ఎరువుల ద్వారా డాబాపై కూరగాయల సాగు చేస్తున్న ఆలమూరు రైతు ఈదల రామారావుకు పలు అంశాలపై సూచనలు చేశారు. గుడ్డు దశలోనే పురుగుల నివారణ చేసుకునేలా గోమూత్రం, గో పేడ, వేప ఆకులను నాలుగు రోజులపాటు నానబెట్టి చేసిన నీమాస్త్రం ద్రావణాన్ని మొక్కలపై పిచికారి చేస్తే గుడ్డు దశలోనే పురుగులు చనిపోతాయని తెలిపారు. మొక్కలు ఏపుగా పెరుగుతాయని రైతు రాంబాబు పేర్కొన్నారు.



వాడపల్లి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాలభోగం, నివేదన కార్యక్రమాలను నిర్వహించారు. వసంత మండపంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం అందజేత: ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి భీమవరం గునిపూడికి చెందిన గూడిరి వీరవెంకట గోవర్ధన్- భారతి దంపతులు రూ.1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామి వారి చిత్రపటం అందజేశారు.



విద్యార్థులకు మోటివేషన్ స్పీచ్ ఇస్తున్న దీక్షిత

ఇష్టపడి చదివితే విజయం తథ్యం

కె.గంగవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందాలంటే సిలబస్‌ను స్మార్ట్‌గా చదవాలని వక్తలన్నారు. ఇష్టంతో చదివితే విజయం తథ్యమని యూత్ ఐకాన్‌గా మూడుసార్లు దేశస్థాయిలో ఎంపికై పలు విశ్వ విద్యాలయాల్లో మోటివేషన్ క్లాసులు ఇచ్చిన ఎర్ర దీక్షిత అన్నారు. ఆదివారం పామర్రు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆమె ప్రేరణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వం విడుదల చేసిన బ్లూ ప్రింట్ ప్రశ్నాపత్రాల ఆధారంగా జవాబులు తయారు చేసుకుని చదివితే మంచి మార్కులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎర్ర ఈశ్వరుడు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హసన్‌బాద సర్పంచ్‌ను పరామర్శించిన సూర్యప్రకాష్

ద్రాక్షారామ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ మాతృమూర్తి ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఆదివారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు వైసీపీ రామచంద్రపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పరామర్శించారు. సతీష్ మాతృమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాకిలేటి రాంబాబు, వార్డు సభ్యుడు చింతపల్లి రాంబాబు, జి.సుబ్బారాయుడు, ఆర్.రాజు, నారాయణరావు తదితరులు సతీష్‌ను పరామర్శించారు.



హసన్‌బాద సర్పంచ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం





ఆత్రేయపురం మండలం వెలిచేరు వెళ్లే మార్గం వద్ద విద్యుత్ వైర్లను చుట్టేసిన పిచ్చిమొక్కలు. పక్క చిత్రంలో నార్కెడిమిల్లి వెళ్లే మార్గం వద్ద కిందకు వేలాడుతున్న కరెంట్ వైర్లు

విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నా పట్టదా?

• విద్యుత్‌శాఖ ఉదాశీనతపై రైతుల ఆగ్రహం • ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ధ్వజం

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌కో సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తా రని ఆయా ప్రాంతవాసులు ప్రశ్నిస్తున్నారు. పంట పొలాల్లోని రైతులకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు భయాందోళన చెందుతున్నారు. నార్కెడిమిల్లి వెళ్లే రోడ్డు చెంతనే విద్యుత్ వైర్లు కిందకూ వేలాడుతూ చేతికి అందేలా ఉన్నా ట్రాన్స్‌కో సిబ్బందికి కనిపించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజవరం నుంచి వెలిచేరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు చెంతనే పంట పొలాల్లో విద్యుత్ వైర్లు కిందకూ వేలాడుతూ చెట్లను తగిలి తరచూ మంటలు చెలరేగుతున్న సందర్భాలు ఉన్నా యని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ

రాయవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాయవరం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ డి.సురేష్ బాబు పలు వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. వాహనాలకు సరైన ప్రతాలు లేకపోవడంతో 17 మంది వాహనదారులకు రూ.3,145 అపరాధ రుసుం విధించారు. మైనర్లు వాహనాలు నడిపితే జరిగే అనర్థాలను వివరించడంతో పాటు వారికి వాహనాలు ఇచ్చే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఫైన్ వేశారు. వాహనదారులు అన్ని రికార్డులను సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.



ఆలమూరు మండలం జొన్నాడ శివాలయంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఆరుద్ర నక్షత్ర పూజలు

ఆలమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ ఉమా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లక్ష బిల్వార్చనలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన రావాడ వెంకటశ్రీనివాస్ దంపతులు, తొడుపునూరి శివకుమార్ దంపతులు, కాశీభట్ల సాయినాధ్ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కాళ్లకూరి కనకమల్లేశ్వర రావు, ఆలమూరుకు చెందిన కాళ్లకూరి సూరి పండుతోపాటు పలువురు పండితుల అధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష బిల్వార్చనలు జరిపించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

నేడు సంకటహర చతుర్థి పూజలు

రాయవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాయవరం రాజరాజేశ్వర కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు కాలదరి త్రినాద్ తెలిపారు. ఆదివారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ మార్గశిరమాసం చవితిని పురస్కరించుకుని ఉదయం నుంచి స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు, గరికపూజ, నీరాజన మంత్ర పుష్పాలు తదితర పూజలు నిర్వహిస్తా మన్నారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.



ఆలమూరు-వెదురుమూడి కాలువ తవ్వకాలను చేపడుతున్న దృశ్యం

రబీ సాగుకు ఇబ్బందులు లేకుండా సాగునీరు

ఆలమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వచ్చే రబీ సాగుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడంలో భాగంగా కాలువల తవ్వకాలు మొదలుపెట్టినట్టు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. ఆలమూరు నుంచి వెదురుమూడి వరకు వెళ్లే పంట కాలువకు సాగునీరు అందించే కాలువ ఇటీవల మూసుకుపోయి దిగువ ప్రాంతాలకు సాగునీరు వెళ్లక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ కాలువ ద్వారా ఆలమూరు, చింతలూరు, సందిపూడి, పినపళ్ల, అంగర, వెదురుమూడి పంట భూములకు సాగునీరు సరఫరా అవుతుందన్నారు. ఆలమూరు నుంచి ఎక్స్‌కవేటర్‌తో పనులు మొదలు పెట్టామని పంట కాలువలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. రైతులు కాలువను ఎప్పటికప్పుడు బాగు చేయించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.